

క్రైస్తవ మాసపత్రిక
కృపా వాక్యము
www.preacherstrainingschool.com
జూన్
2024

Editor:

**Dr. K.G. Kumar,** Founder, President & Director, Preachers Training Schools

ఈ సంచికలో . . .


1. మనము దేవునికి దగ్గరగా నున్నామా? - కె.జి. కుమార్

2. సిద్ధముగా ఉండుడి - డి. శ్రీధరరావు

3. క్రైస్తవుడా సిద్ధపడు - పి. చంద్రశేఖర్

4. ఓ జీవన నేస్తమా జాగ్రత్త ! - 128 - కె. సంధ్యారాణి

5. సత్క్రియలు ఆశక్తితో చేయుట - కె.జి. కుమార్


## OWNERSHIP INFORMATION:


| | | |
|---|---|---|
| Publisher | : | Dr. K.G. Kumar |
| Printer | : | Mr. G. Venkateswarao |
| Owner | : | Dr. K.G. Kumar |
| Printing Press | : | Near Pindala Tank<br>Jawahar Street<br>Kakinada-533003 |
| Place of Publication | : | Turangi, Kakinada-533 016<br>D.No.7-113, Ravindranagar,<br>Turangi, Kakinada-533 016,<br>E.G.Dist., A.P., |
| Periodicity of Publication<br>& Language | : | Monthly, Telugu & English |
| Nationality | : | Indian |

సింగిల్ కాపీ : 20/- సంవత్సరపు చందా : 200/- జీవితకాలపు చందా : 1500/-

మీచందాను ఈ దిగువ బ్యాంకు అకౌంట్కైనను పంపవచ్చును

**ది సౌత్ ఇండియన్ బ్యాంక్, కాకినాడ**

RTGS Code: SIBL0000126 , అకౌంట్ నెం. 0126053000006977

కృపావాక్యము మాసపత్రిక కావలసినవారు చందా పంపవలసిన చిరునామా



ఎడిటర్, కృపావాక్యము cell: 9849031095, 6309686167

రవీంద్రనగర్, తూరంగి

కాకినాడ-533016, తూ.గో.జిల్లా, ఆం.ప్ర., ఫోన్: 2342125

Email: kedarisetti_2000@yahoo.com

Website: www.preacherstrainingschool.com

# క్రైస్తవాక్షేయము

CHURCH OF CHRIST

Pleading for the Unity of Brotherhood

క్రీస్తుసంఘము. మత్త. 16:18, ఎఫె. 1:22,23, కొల. 1:18,24, రోమా 16:16

సంపుటి 27 | జూన్ 2024 | సంచిక 6

## మనము దేవునికి దగ్గరగా నున్నామా?

మనము అప్పుడప్పుడు దేవునికి దూరముగా నున్నట్లు వ్యాకులత చెందుదాము. అలాంటి సమయములలో మనము కన్నీటితోను లేక హృదయమంత భారముతో మన విధేయతను దేవునికి తెలియజేయుచూ పాపములను దేవుని ముందు ఒప్పుకొని క్షమాపణము వేడుకొంటాము.

చూడండి దావీదు తన అవిధేయత కాలముతోను, పాపము చేసిన కాలములోను తాను విలపించిన విధానమువలన దేవుడు దావీదును క్షమించి, తన ఆత్మతో సహవాసమును అనుగ్రహించెను. "నేను పాపము చేసితినని దావీదు నాతానుతో అనగా నాతాను- నీవు చావకుండునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను. అయితే ఈ కార్యమువలన యెహోవాను దూషించుటకు ఆయన శత్రువులకు నీవు గొప్ప హేతువు కలుగజేసితివి గనుక నీకు పుట్టిన బిడ్డ నిశ్చయముగా చచ్చునని దావీదుతో చెప్పి తన యింటికి వెళ్లెను" (2 సమూ. 12:13-15).

దేవునిలో ఎదగడానికి, నడవడానికి కొందరికే సాధ్యమగును. మనము చూచినట్లయిన హనోకు దేవుడు దేవునితో నడచినట్లు వాక్యము సెలవిచ్చుచున్నది? "హనోకు దినములన్నియు మూడువందల అరువదియైదేండ్లు హనోకు దేవునితో నడిచిన తరువాత దేవుడతని తీసికొనిపోయెను గనుక అతడు లేకపోయెను" (ఆది. 5:23,24). ఏలియా కూడా నిష్టాగరిష్టుడై దేవుని సేవించుటచే దేవునిచే కొనిపోబడెను.

“వారు ఇంక వెళ్లుచు మాటలాడుచుండగా ఇదిగో అగ్ని రథమును అగ్ని గుఱ్ఱములును కనబడి వీరిద్దరిని వేరుచేసెను; అప్పుడు ఏలీయా సుడిగాలిచేత ఆకాశమునకు ఆరోహణమాయెను'' (2 రాజు. 2:11).

కొన్ని సమయములలో మన ఆంతర్య పురుషుడు బహుగా కృషించినను, నీతి భక్తిగల జీవితములో పునర్జీవింపజేసుకొనవచ్చును. పౌలు వేరొక విధముగా కూడా మనతో సంభాషించుచున్నాడు. బాహ్యపురుషుడు కృషించిన అంతరంగ పురుషుడు శక్తి పొందుటకు ప్రార్థన, భక్తి, విశ్వాసములతో బలపడును. బాహ్యపురుషుడు వయస్సునుబట్టి సరియైన ఆహారము లేకపోయినను వాడు కృషించును. ఆ తరువాత మరణమొంది మట్టిలో మమేకమై మట్టియగును. “మన్నయినది వెనుకటివలెను మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును'' (ప్రసంగి 12:7). “మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును'' (హెబ్రీ 9:27).

దేవునికి దగ్గరగా లేక సమీపముగా మనము వుండవలెనన్నా మన హృదయమునందు ఆయన ఆత్మ సంతరించుకొనవలెను. దానికి ఒక మూడు విషయములను పరిశీలింతుము. దేవుని ప్రేమించుచున్నావు గాన నీ సహోదరుని కూడా ప్రేమించు లేనియెడల నీవు దేవుని ప్రేమను పొందలేవు. “ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము. ఎవడైనను-నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు దేవుని ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయనవలన పొందియున్నాము'' (1 యోహా. 4:19-21).

మొదటిగా రీచ్ అవుట్ అనగా నీవలన ఎవరి సహాయమో వారికి సహాయము చేయుటకు నీ చేయి అందించుము. మనము సుళువుగా చిక్కులలో పడడము చాలా ఈజీ-అందువలన మనకు కలిగినదంతయు మనకొరకేనని గట్టిగా పట్టుకొనరాదు. అవసరమగు సమయములో మనము మన సహాయం యితరులకు చేయబద్ధులమై యున్నాము “అపవాదికి చోటియ్యకుడి, దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కరగల వానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో

మంచి పనిచేయుచు కష్టపడవలెను. వినువారికి మేలుకలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీనోట రానియ్యకుడి'' (ఎఫె. 4:28).

మనము దేవుని సేవించుటకు, ఆయనకు నమ్మకముగా జీవించుటకు ఎన్నో ఆటంకములు అవరోధము కలుగును. "మేము మీయొద్ద ఉన్నప్పుడు, మనము శ్రమను అనుభవింపవలసియున్నదని మీతో ముందుగా చెప్పితిమి గదా ఆలాగే జరిగినది. ఇది మీకును తెలియును; అట్టి శ్రమలను అనుభవించుటకు మనము నియమింపబడినవారమని మీరెరుగుదురు'' (1 థెస్స. 3:3). ఈ అవరోధములన్నియు మనలను దేవునితో నడచుటకు ఆటంకములుగా నిలుచును, హెబ్రీ పత్రిక 11వ అధ్యాయములలో గల విశ్వాసవీరులందరు వారి విశ్వాస బలములో బలవంతులై తమ రక్షణను కాపాడుకొన్నారు. అదే సమయములో బైబిలు చెప్పునది ఏమనగా వారు దేవునితో నడచిరని అలాగుననే వారు జీవించిన కాలములో తమ దైనందిన జీవితములో ఎన్నో శ్రమలు, కష్టములు, హింసలు పొంది వారి రక్షణను కాపాడుకొన్నారు, వారికి కలిగిన బలమైన విశ్వాస సంకల్పముతో దేవునితో నడచి ఆటంకములను జయించిరి. దేవునితో నడవవలననే ఆశ మనకున్నయెడల లోకాశల నుండి దూరపర్చును.

మనము ఆలోచించుదాము, ముందెన్నడైన మనము దేవునితో సమయము గడిపితిమా? రాజైన హిజ్కియావలే దేవునిముందు మొర్ర పెట్టితిమా? "ఆ దినములలో హిజ్కియాకు మరణకరమైన రోగము కలుగగా, ఆమోజు కుమారుడును ప్రవక్తయునైన యెషయా అతనియొద్దకు వచ్చి - నీవు మరణమవుచున్నావు, బ్రదుకవు గనుక నీవు నీ యిల్లు చక్కబెట్టుకొనుమని యెహోవా సెలవిచ్చుచున్నాడని చెప్పగాఅతడు తన ముఖము గోడతట్టు త్రిప్పుకొని యెహోవా, యదార్థహృదయుడనై, సత్యముతో నీ సన్నిధిని నేనెట్లు నడుచుకొంటినో, నీ దృష్టికి అనుకూలముగా సమస్తమును నేనెట్లు జరిగించితినో కృపతో జ్ఞాపకము చేసికొనుమని హిజ్కియా కన్నీళ్లు విడుచుచు యెహోవాను ప్రార్థించెను'' (2 రాజు 20:1-3).

అయితే మన జీవితములో టి.విని గాని లోకసంబంధమైన వినోదములు గాని దేవునికన్నా ముందుగా ఎంచకున్నామా? అయితే వాటిని మనలను ఏలనీయకూడదు.

అట్టివి దేవునితో సమాధానము కానేరవు, దేవునికి ఒక ప్రత్యేకమైన, పవిత్రమైన స్థానము, పరిశుద్ధులుగా మన హృదయములో నిలుపుటచే లోకమునుగాని, లోకములో నున్నవి గాని మన దరిచేరలేవు, గృహవిషయములోను, కుటుంబ విషయములోను, భార్యభర్తల సంసార జీవితములోను పవిత్రతను పాటించుము.

మనము దేవునితో సమయము గడుపుటకు మొదటిగా ఏకాంతము, నిశ్శబ్దత గలిగి, శరీర శుభ్రత గలిగి, మనస్సును నిగ్రహించుకొను శక్తిని ముందుగా ఆశించు లేక దేవునివద్ద కోరుకో. నీతిని, యదార్థతను, ధర్మమును నీ మనస్సునందు నిలుపు అప్పుడు ప్రార్థన ప్రారంభించు క్రీస్తుపై ధ్యానము నిలుపు, అప్పుడు ప్రభు ముఖారవిందమును ఆశించు. అప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు ప్రభువుయొక్క రూపమును నీకనుగ్రహించును. తండ్రియైన యెహోవా, వెలుగు స్వరూపి, ఆత్మా స్వరూపి నైనున్నాడు గాన ఆయనకు రూపము లేదు. అయితే ప్రభువు మానవుల మధ్య బ్రతికి జీవించిన రూపమును కాంక్షించుము. అనేక సమయములలో మనము మన పనులు ఒంటరిగా చేయుచున్నప్పుడు ప్రభువును ధ్యానించు. నీ పని సులభముగా నుండును.

మనము ఎప్పుడైతే మన పూర్ణమైన హృదయముతో దేవునికి దగ్గరగా వుండుటకు కోరుకొందుమో అప్పుడు ఆయన పరిశుద్ధతను మనకు సమీపముగా నిలుపును "దేవునియొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును. పాపులారా, మీ చేతులను శుభ్రము చేసికొనుడి; ద్విమనస్కులారా, మీ హృదయములను పరిశు ద్ధపరచుకొనుడి" (యాకో. **4:8**, యిర్మి. **29:12-14**). అనయాకోబు ఊరకనే చెప్పలేదు భక్తిహీనులు అర్పించు బలులు యెహోవాకు హేయములు యథార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము (సామె **15:8**)

నీవు దేవునికి దగ్గరగా నుండుటకు ఆరాధించుచున్నావా? ఆయన ఆజ్ఞలను కట్టడలను ఎరిగియుండి ఆయన ఆత్మయందు నిత్యము సహవాసము చేయుట ఎట్లో ప్రార్థించి తెలుసుకో. నేటి బోధకులు, సువార్తికులు, క్రైస్తవులు ప్రార్థన మాని ధనసంపాదనయందు మనస్సు పెట్టుట ఆడంబరముగా జీవించుటకు ఇష్టపడినంత కాలము వారు దేవునికి దగ్గరగా రాజాలరు మరియు వారి బోధ ఫలించదు. జాగ్రత్త!

# “సిద్ధముగా ఉండుడి”

ఓ. శ్రీధరరావు, M.A.,
PT School 9154927278

**ముఖ్యవచనము:-** లూకా 12:40, మత్త. 24:44

**పరిచయము:-** ప్రభువునందు ప్రియులైన కృపావాక్యము పాఠకులందరికి ప్రభువైన యేసుక్రీస్తు నామమున వందనములు. “సిద్ధపాటు”, “సిద్ధపడుము” అనే పదములను అనేక సందర్భములో చాలాసార్లు మనము వింటాము.

ఉదా॥ వయస్సు వచ్చినవారు వివాహము కొరకు సిద్ధముగా ఉంటారు. చదువు పూర్తి అయినవారు ఉద్యోగం కొరకు సిద్ధముగా ఉంటారు. ప్రయాణము చేయాలి అనుకునేవారు వారు అనుకున్న స్థలమునకు వెళ్లుటకు సిద్ధముగా ఉంటారు.

అయితే క్రైస్తవుడిగా నీవు, నేను దేనికొరకు సిద్ధముగా ఉండాలి. ప్రభువైన యేసుక్రీస్తు కూడ “సిద్ధముగా” ఉండుడి అని ఉపమానమును చెప్పెను.

I. **విందు సిద్ధముగా ఉన్నది:** (మత్త. 22:1-14) ప్రభువు చెప్పిన ఉపమానము గమనించినప్పుడు పరలోక రాజ్యము తన కుమారుని పెండ్లి విందు చేసిన యొక రాజును పోలియున్నది. అయితే వారు విందుకు పిలువబడినవారు అనేక నెపములు చెప్పసాగిరి. పిలువబడినవారు సిద్ధముగా (8వ.) ఉండకపోవుట గమనించగలము. విందు యజమానుడు ఇతరులను పిలిచెను (10వ). వారికి విందు చేసెను కనుక సిద్ధముగా లేనివారు విందు స్వీకరించకపోయిరి.

II. **రక్షణ కొరకు సిద్ధముగా ఉండాలి:** (హెబ్రీ 11:7) నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి తన యింటివారి రక్షణ కొరకు ఒక ఓడను సిద్ధము చేసెను. అలాగున బాప్తిస్మము కొరకు సువార్త వినే ప్రతివారు సిద్ధముగా ఉండాలి సువార్త విని వదిలేయకూడదు (హెబ్రీ 2:1).

III. **దేవుని కొరకు సిద్ధముగా ఉండాలి:** మనకు సమయము సిద్ధముగా ఉన్నది (యోహా. 7:6). సువార్తికుడు సువార్తను ప్రకటించుటకు సిద్ధముగా ఉండాలి (రోమా 1:15-16). అలాగునే క్రైస్తవుడు అయిన ప్రతివాడు ఆరాధనకు సిద్ధముగా ఉండాలి

(యోహా. 4:24, హెబ్రీ 10:24) మరియు దేవుని విషయములో చేయవలసిన ప్రతి కార్యమునకు సిద్ధముగా ఉండాలి.

1) పాటలు పాడుటకు
2) ప్రార్థన చేయుటకు
3) వాక్యము వినుటకు, ప్రకటించుటకు
4) ప్రభురాత్రి భోజనము ఆచరించుట కొరకు
5) కానుకలు దేవునికి ఇచ్చుట కొరకు సిద్ధముగా ఉండాలి.
6) సత్క్రియలు చేయుటకు
7) ఆత్మీయ ఫలములు ఫలించుట కొరకు ఇవన్నియు జరిగించుటకు సిద్ధముగా ఉండాలి.

IV. **మరణము కొరకు సిద్ధముగా ఉండాలి:-** ప్రతి మనుష్యుడు మరణము ఎదుర్కొనవలెను అది ఎప్పుడైన రావచ్చును (కీ. 90:1-10). పౌలు అయితే నేను చనిపోవుటకు సిద్ధముగా ఉన్నానని చెప్పెను (అపొ.కా. 21:13). కనుక మరణము ఎప్పుడు వచ్చునో ఎవరికి తెలియదు. అయిన అందరు సిద్ధముగా ఉండవలసిన అవసరము ఉన్నది (హెబ్రీ 9:27).

V. **రాకడ కొరకు సిద్ధముగా ఉండాలి:-** (1 థెస్స. 4:13-17) అన్ని విషయములలో మానవుడు సిద్ధపాటు కలిగివుంటాడు కాని రాకడ విషయంలో సిద్ధముగా ఉండరు. కాని సిద్ధముగా ఉండవలసిన అవసరము ఎంతైనా ఉంది (యాకో. 5:7-8). ప్రభువు రాకడ కొరకు సిద్ధముగా ఉండుడి. అనుకొనని గడియలో ప్రభువు వచ్చును (ప్రక. 3:3, మార్కు 13:32, మత్త. 24:44).

VI. **తీర్పు కొరకు సిద్ధముగా ఉండుడి:-** (1 పేతు. 4:5) ప్రతివారును తీర్పు కొరకు సిద్ధముగా ఉండాలి. సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండాలి (1 పేతు. 3:15). మనము అందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలెను (2 కొరి. 5:10, ప్రసంగి 12:14). ప్రతి అంశమును గూర్చి తీర్పు తీర్చబడును కనుక సిద్ధముగా ఉండాలి.

**VII. నీవు సిద్ధముగా ఉన్నావా?** మానవులముగా మనము ప్రతి విషయములో సిద్ధముగా ఉంటాము మన ఆత్మీయ విషయంలో సిద్ధముగా ఉండలేకపోతాము అలాగైతే నీవు క్రీస్తు వచ్చినప్పుడు ఆయనతోపాటు ఎత్తబడలేవు కాబట్టి నీవు సువార్తకు లోబడి బాప్తిస్మము పొంది క్రైస్తవునిగా చేయబడి సిద్ధపాటు కలిగియుండుము. ఇటువంటి సిద్ధపాటు అనేది చాలా అవసరము.

ఒకవేళ నీవు ఇంతకుముందే క్రైస్తవుడవు అయినట్లు అయితే సువార్త ప్రకటించాలి అని అనుకుంటే సహో॥ కె.జి.సార్‌గారి ఆధ్వర్యంలో నడుపబడుతున్న పి.టి.స్కూల్ నిన్ను మంచి బోధకునిగా, సువార్తికునిగా తయారుచేయగలదు కావున స్కూల్‌లో బైబిలు తర్ఫీదు పొందుటకు సిద్ధముగా ఉండుము (అడ్మిషన్స్ ఆగష్టు 1న). దేవుడు అట్టి కృపా భాగ్యమును ఇచ్చును గాక. అందరికి వందనములు.

## క్రైస్తవుడా సిద్ధపడు

పి. చంద్రశేఖర్, M.A., B.D.
PT School 9666526240

ప్రభువునందు ప్రియమైన కృపావాక్యము పాఠకులైన సహోదరి, సహోదరులకు నా వందనములు. మహాదేవుని కృపనుబట్టి గతకాలము కాచి కాపాడిన దేవునికి నా కృతజ్ఞతలు. ఏప్రియల్, మే నెలలు విద్యార్థిని, విద్యార్థులు పరీక్షల కొరకు సిద్ధపడు సమయము. జూన్-జూలై నెలలు పరీక్షలలో ఉత్తీర్ణులైనవారు ఆయా కాలేజిలలో చేరుటకు సిద్ధపడే కాలము. ఈ లోకములో ఏదైనా ఒక పని చేయవలెననిన, చేయవలసిన పనికంటె ఆ పనికొరకు ముందుగా సిద్ధపడుట అత్యవసరము. మనము ఏదైనా ఊరు ప్రయాణము చేయవలెననిన ఆ ప్రయాణము కొరకు కావలసిన దుస్తులు, ధనము మొదలగునవి ముందుగా సిద్ధపరచుకొందుము. యేసుప్రభువు (యోహా. 14:1-3) శిష్యులతో ఇట్లు చెప్పెను. “మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచినప్పుడు, నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును

తీసికొని పోవుదును.” ఇక్కడ యేసుప్రభువు మనకొరకు ఒక నిత్యనివాసమును ముందుగా సిద్ధపరచెను. అట్టి నిత్యనివాసములో మనము నివసింపవలెనని మనము ముందుగా సిద్ధపడవలెను అని దీని తాత్పర్యము.

## 1. నోవహు కాలమునాటి ప్రజలు సిద్ధపడలేదు:-

దేవుడు సృష్టినంతటిని సృజించిన తరువాత, భూమి అంతా దుర్మార్గములతో నిండియుండుట దేవుడు చూచాడు. అయితే నోవహు నీతిపరుడును తన తరములో నిందారహితుడై యుండెను. నోవహు దేవునితో కూడ నడచినవాడు. దేవుడు ప్రపంచాన్ని జలప్రళయంతో నాశనము చేయబోవుచున్నాను గనుక ఒక ఓడను నిర్మించమని నోవహుకు చెప్పెను (ఆది. 6:8-14).

దేవుడు తనకాజ్ఞాపించిన ప్రకారము నోవహు ఓడను నిర్మించుచుండగా దేవుడు జలప్రళయం ద్వారా భూమిని నాశనం చేయబోవుచున్నాడని అతడు ప్రకటించాడు (2 పేతు. 2:5). అయితే నోవహు ఓడలో ప్రవేశించుటకు సిద్ధపడెను, కాని ఆనాటి ప్రజలు ఓడలో ప్రవేశించుటకు సిద్ధపడలేదు మరియు వారు నోవహు హెచ్చరికలను ఎవరును వినలేదు హేళన చేసిరి. “దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచుచుండగా అవిధేయులైన వారి యొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మలయొద్దకు ఆయన ఆత్మరూపి గానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిదిమంది నీటిద్వారా రక్షణ పొందిరి” (1 పేతు. 3:19-21). నలువది దివారాత్రులు వర్షం కురిసింది. ఆనాటి లోకములో దుర్మార్గులందరు సిద్ధపడక నాశనమయ్యారు. జీవించుచున్నవారందరు జలచరములు, ఓడలో యున్నవారు మాత్రమే. ఇకమీదట భూమినంతటిని నీటిద్వారా నాశనం చేయనని దేవుడు వాగ్దానము చేసాడు. యేసుప్రభువు మరల వచ్చి ఆయనకు లోబడనివారిని ప్రతిదండన చేసి భూమిని అగ్నితో నాశనము చేయును (2 పేతు. 3:6-7). ప్రభువు రెండవసారి వచ్చునప్పుడు, రాత్రివేళ దొంగవచ్చునట్లు వచ్చును (ప్రక. 16:15). ఆయన మరల ఎప్పుడు వస్తాడో పరలోకమందలి దేవదూతలకు కూడ తెలియదు (మత్త. 24:36-37). నోవహునాటి ప్రజలకు అతడు బోధించినను వారు సిద్ధపడలేదు. చివరిగా ఓడ తలుపు మూయబడినందున వారు ఓడలో ప్రవేశింపలేక నశించిరి.

## 2. బుద్ధిలేని కన్యకలు పెండ్లి కుమారుని కొరకు సిద్ధపడలేదు:-

బుద్ధిలేని కన్యకలు వారు కొనబోవుచుండగా పెండ్లి కుమారుడు వచ్చెను. అప్పుడు సిద్ధపడియున్నవారు (బుద్ధిగల కన్యకలు) అతనితో కూడ పెండ్లి విందుకు లోపలికి పోయిరి; అంతట తలుపు వేయబడెను. ఆ తరువాత బుద్ధిలేని కన్యకలు ఆలస్యంగా వచ్చి-అయ్యా, అయ్యా మాకు తలుపు తీయుమని కేకలు వేసారు. అయితే ఆయన తలుపు తీయలేదు (మత్త. 25:10-13). ప్రభువా, ప్రభువా అని పిలుచు ప్రతివాడు పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందు ఉన్న తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును (మత్త. 7:21) అని ప్రభువు చెప్పెను.

యేసు మరల వచ్చినప్పుడు ఆయన రాజ్యమును తండ్రికి అప్పగించును (1 కొరి. 15:22-28). రాజులకు రాజు తిరిగి వచ్చుచున్నాడు. గనుక ప్రతివాడు ఆ ఘడియ కొరకు సిద్ధపడవలెను. క్రైస్తవులు వారు నమ్మకముగా జీవించవలెను (తీతు 2:11-12). తీర్పు దినమున క్రీస్తు మరల వచ్చునపుడు మనము సిద్ధపడి యుండాలి. మనం సిద్ధపడి యుండకపోతే నిత్యపరలోకపు తలుపులు మనకు ఎల్లప్పటికీ మూయబడతాయి.

ప్రియ సహోదరీ సహోదరుడా నోవహు కాలమునాటి ప్రజలవలె, బుద్ధిలేని కన్యకలవలె సిద్ధపడకుండా ఉండకూడదు. యేసుప్రభువు సువార్తను విని, విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని, బాప్తిస్మము పొంది దేవుని రాజ్యములోనికి తిరిగి జన్మించుము. తీర్పు దినము కొరకు సిద్ధపడుము నీవు క్రైస్తవుడవు లేక మంచి సువార్తికుడవు కాగోరుచున్న యెడల పి.టి.స్కూల్‌నందు చేరి క్రైస్తవుడు/సువార్తికుడగుట ఎట్లో తెలిసికొనుము. నిజమైన సంఘమును అనగా క్రీస్తు సంఘమును గూర్చి తెలిసికొనుము. బుద్ధిగల కన్యవలె క్రీస్తు రాకడ కొరకు ఎల్లప్పుడు సిద్ధపడి యుండుము. మీకు శుభములు కలుగును గాక!

# ఓ జీవన నేస్తమా జాగ్రత్త!-128

కె. సంధ్యారాణి, B.A.
పి.టి.స్కూల్

కృపావాక్యము చదువరులకు నా హృదయపూర్వక వందనములు.

గత సంచికలో మనం నిత్యజీవమును గూర్చి నేర్చుకొనియున్నాము. ఈ నెల కూడా మరి కొన్ని విషయములను నేర్చుకొందాము.

పేతురు ఇదిగో-మేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమని ఆయనతో చెప్పసాగెను. అందుకు యేసు ఇట్లనెను- నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్కచెల్లెండ్రనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతోపాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను, రాబోవు లోకమందు నిత్యజీవమును పొందునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (మార్కు 10:28-31).

అనగా ఇచ్చట ఒక విషయమును మనం గమనించాలి ప్రభువువారు నిజముగా అన్నదమ్ములను, అక్కచెల్లెండ్రను వున్నవన్ని వదిలేయమని ఆయన చెప్పుటలేదు కానీ వారు దేవుని సేవకు ఆటంకముగా నిలిచినప్పుడు అవసరమైతే దేవుని కొరకు వాటన్నిటిని వదిలేయ్యాలి అని అర్థం.

ప్రియులారా ఇచ్చట పేతురుగారికి ప్రభువుకి మధ్య జరిగిన సంభాషణను మనం గమనించినప్పుడు పేతురులాంటి స్వభావమే మనది కూడా ఎందుకనగా ప్రతి ఫలమును ఆశించకుండా ఏ పనీ చేయము. మనము ఏదైనా కొంత నష్టపోతున్నాము అంటే దానికి తగిన ప్రతిఫలాన్ని ఆశిస్తూ వుంటాము. అయితే ప్రభువువారు అంటున్నారు మీరు ఈ భూమిమీద నష్టపోయినదానికి నూరంతలు అది మాత్రమే కాక అంతకంటే ప్రాముఖ్యమైన నిత్యజీవమును ఆయన ఇస్తానన్నారు.

కనుక ప్రియులారా మనం ఈ భూమిమీద తాత్కాలికమైనవాటి కొరకు ప్రాకులాడుతూ వుంటాము కానీ అసలైన దానిమీద అనగా నిత్యజీవమును సంపాదించుకొనుటకు ప్రయాసపడము.

ఈ భూమిమీద మన జీవమేపాటిది అని యాకోబుగారు అంటారు అనగా బ్రతికియున్నప్పుడే దేవున్ని తెలుసుకొని , ఆయన కొరకు బ్రతకాలని. ఈ రోజుల్లో

అందరూ ఈ భూమిమీద ఎంత సంపాదిస్తున్నామో అని లెక్క చూసుకొనేవాళ్లే కాని దేవుని కొరకు, నిత్యజీవము కొరకు నేనేమి చేస్తున్నాను అని ఎవరేమి ఆలోచించుటలేదు.

అందరును తమ సొంతకార్యములనే చూచుకొనుచున్నారు గాని, యేసుక్రీస్తు కార్యములను చూడరు ( ఫిలిప్పీ 2:21).

నిజమే ప్రియులారా మనందరము మన సొంత పనులను మాత్రమే చేసుకొంటాము కానీ దేవుడన్నా, దేవుని పని అన్నా లెక్కచేయము, ఆ ఆదివారము ఆరాధనకు వెళ్లుటయే చాలా గొప్ప అని భావిస్తూవుంటాము. ప్రతి క్రైస్తవుడు, క్రైస్తవురాలు ఈ వైఖరిని విడిచిపెట్టాలి. దేవుని పనిని ముందుగా చూడాలి. అలాగున దేవుని కొరకు సమస్తమును వదులుకొన్న వారిని మనం మాదిరిగా పెట్టుకోవాలి.

అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవువారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధానపాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని (1 తిమో 1:16).

ప్రియులారా ఇచ్చట అపొ॥ పౌలుగారిని మనం గమనించినట్లయితే ఆయనలాగున ఎవరైతే నిత్యజీవమును సంపాదించుకోవాలని ఆశ కలిగియున్నారో, ఇదిగో మీరు కేవలం ఆశ కలిగియుంటే సరిపోదు నాకులాగున సమస్తమును దేవుని కొరకు, ఆయన సేవకొరకు వదులుకోవాలనేటువంటి మాదిరిని ఆయన మనందరి ముందు వుంచాడు.

పౌలుగారి జీవితాన్ని ఒక్కసారి మనం ఆలోచన చేసినప్పుడు ఆయన విద్య, ధనము అన్ని వుండి కూడా సుఖభోగములు అనుభవించే సౌకర్యములు వుండి కూడా, దేవుడు అతన్ని ఎన్నుకొన్నప్పుడు వాటన్నిటిని పెంటతో సమానముగా ఎంచాడు. నా కొరకు నీతికిరీటముంచబడియున్నదని నమ్మకతో ఎదురుచూస్తున్నాడు.

కనుక ప్రియ సోదరీ మరి మనం పౌలుగారిని మాదిరిగా పెట్టుకొని ఆయనలాగున నమ్మకతో నా కొరకు నీతికిరీటం వుంది అని ఆశతో ఆ నిత్యజీవము కొరకు ఎదురు చూస్తున్నామా? ఒక్కసారి ఆలోచన చేద్దాం. ఆలాగున కానట్లయితే ఇన్ని సంవత్సరములు మన క్రైస్తవ జీవితము బూదిడలో పోసిన పన్నీరే అగును.

# సత్క్రియలు ఆశక్తితోచేయుట

## మత్త. 5:16

**మూలవాక్యము:**

మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి.

**ముఖ్యఉద్దేశ్యము:**

లోకమును పాపములో బంధించిన దేవుడు క్రీస్తునందు విశ్వాసులైనవారికి నీతి మార్గమును తెరచి సత్క్రియల ద్వారా పరలోక ప్రవేశము అనుగ్రహించుట.

**ఉపోద్ఘాతము:**

1) దేవుడు తన వాక్యము ద్వారా కనిన కుమారులు, కుమార్తెలు. యాకో. 1:18.
2) ప్రభువైన క్రీస్తును పోలి వుండాలని ముందుగా క్రీస్తు ప్రభువును రూపొందించుకొనెను. ఎఫె. 1:3-6.
3) వారు క్రీస్తువలే సత్యము చెప్పుచు అన్ని విషయములలోను ఎదగవలెనని తలంచి క్రీస్తునందుల కుమారులను ఆశించెను. ఎఫె. 4:15
4) వీరికొరకు కొన్ని సత్క్రియలను చేసి క్రీస్తునందు దాచి క్రీస్తును కలిగియున్న వారికి వాటిని వాక్యము ద్వారా ఆత్మ ద్వారా బోధించుచుండెను. కొల. 2:3-4.
5) అందువలన పాపములతోను అపరాధములతో మృతులైనవారిని, వారి అపరాధములు క్షమించెను. కొల. 2:13-15
6) భూమిపై నున్నంతకాలము, భూసంబంధమైన అవయవములను చంపివేసి అన్యత్వముతో కూడిన ప్రాచీన స్వభావమును దాని క్రియలను పరిత్యజించ వలెను. కొల. 3:5-10
7) నీతియు యదార్థమైన భక్తి కలిగినవారై క్రీస్తువలే అన్ని విషయములలోను ఎదుగుదుము. ఎఫె. 4:15
8) క్రీస్తుప్రభువును ప్రేమించువాడు మాత్రమే సత్క్రియలు చేయగలడు. నీవు నేను ప్రభువును ప్రేమించుచున్నామా?

**చర్చనీయాంశము:**

I. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపర్చుట. మత్త. 5:16ఎ

1) దేవుని పిల్లలు ఏమి చేయవలెను? 1 పేతు. 2:11,12

2) వారు యాత్రికులు, పరదేశులు గనుక. 1 పేతు. 2:11ఎ

3) శరీరసంబంధమైనవి విసర్జించి. 1 పేతు. 2:11బి

4) క్రైస్తవులమైన మనమిప్పుడు అన్యులచే నిందించబడుచున్నాము ఎందుకనగా పూర్వమందు వారితో పరుగెత్తియుంటిమి గాని యిప్పుడు వేరైనందుకు. 1 పేతు. 2:12ఎ

5) అన్యుల విధానము. ఎఫె. 2:1-3, 4:17-24

6) అవిశ్వాసుల విధానము. 2 తిమో. 3:1-9

7) తిన్నని మార్గమును విడచుట. 2 పేతు. 2:15-20

II. మీ వెలుగు ప్రకాశించనీయుము. మత్త. 5:16బి

1) మీరు బహుగా ఫలించుటవలన తండ్రి మహిమపర్చబడును ఇందువలన నా శిష్యులగుదురు. యోహా. 15:8

2) నిష్కపటులును నిర్దోషులును కావలెననియు ప్రార్థించుచున్నాను. ఫిలి. 1:9-11, అపొ.కా. 24:16 అభ్యాసము చేసుకొనవలెను.

3) సత్క్రియలయందు ఆశక్తిగల ప్రజలుగా మిమ్మును. ఎఫె. 2:10

4) క్రీస్తునందు ముందుగా తన కొరకు నిర్ణయించు. ఎఫె. 1:4-6

5) చచ్చినవారైన వారిని ప్రేమతో క్రీస్తునందు తిరిగి బ్రతికించెను. ఎఫె. 2:5, తీతు 3:5

**ముగింపు:**

1) పరిశుద్ధ జీవితమును అలవర్చుకొనుట ముఖ్యము. మత్త. 5:8

2) ఆత్మవలన ప్రార్థించుటకు ఇష్టపడి శ్రమించవలెను. యూదా 21

3) అప్పుడు మనము ఆత్మతో ఆరాధించగలము. ఫిలి. 3:3

4) కొందరు మానుకొన్నట్లు ఆరాధనమానక. హెబ్రీ. 10:24

5) దేవునికి ఇచ్చుటలో శ్రద్ధ కలిగియుండు. 2 కొరి. 9 అధ్యా.

చెప్పండి ప్రోత్సహించండి పంపించండి

# ఉచిత బైబిల్ ట్రైనింగ్

# అడ్మిషన్స్ జరుగుచున్నవి

→ 1 సం॥ (**D.Th.**) లేదా 2 సం॥ (**B.Th.**) తెలుగు మీడియం బైబిల్ ట్రైనింగ్ కొరకు

విద్యార్హతలు : పదవ తరగతి ఫెయిల్ లేక ఆ పైన

→ 1 సం॥ (**D.Th.**) లేదా 3 సం॥ (**B.B.S. or B.D.**) ఇంగ్లీషు మీడియం బైబిల్ ట్రైనింగ్ కొరకు

విద్యార్హతలు : ఇంటర్ ఫెయిల్ లేక ఆ పైన

**(గ్రీకు, ఇంగ్లీషు నేర్పుట మా ప్రత్యేకము)**

**చేతివృత్తులు** : 1) టైపు 2) టైలరింగ్ 3) కంప్యూటర్ 4) టి.వి. & సెల్‌ఫోన్ నేర్పబడును.

→ **నెలకు 5 రోజుల బైబిల్ ట్రైనింగ్ (పురుషులకు మాత్రమే)**

వయస్సుతో సంబంధం లేదు, సంఘబేధం లేదు, అన్ని మతశాఖలవారికి మా ఆహ్వానం

పెండ్లి అయినవారు, సంఘకాపరులు లేక సువార్తికులకు మాత్రమే

విద్యార్హతలు : పదవ తరగతి లేక ఆ పైన

**ఒరిజనల్ టి.సి. లేదా మార్క్‌లిస్ట్‌గాని తప్పనిసరిగా తీసుకొనిరావలెను**

## అందరికి నెలసరి స్టైఫండ్ రూ.500

**అందరికి ఉచిత భోజనము, వసతి ఏర్పాటుచేయుబడును**

కృతజ్ఞ ఫలితము

ఆసక్తి గలవారు ఈ క్రింది చిరునామాను సంప్రదించండి

డైరెక్టర్, పి.టి.స్కూలు, తూరంగి, కాకినాడ-16

ఫోన్: 0884-2342125, సెల్: 9849031095

email: **kedarisetti_2000@yahoo.com**

website: www.preacherstrainingschool.com